

కొత్త తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్

సమయపాలన పాటించాలి

- అధికారులు, సిబ్బందికి కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచన
- పరిగిలో కొత్త తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం

పరిగి,ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. ఓల్డ్ తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరినందున మండల పరిషత్ ఆవరణలో ఉన్న పంచాయతీరాజ్‌కు శాఖకు చెందిన భవనంలో ఏర్పాటు చేసిన తహసీల్దార్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ఎస్పీ నారాయణరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాయలంలోని సిబ్బంది అందుబాటులో ఉండి, ఇక్కడకు వచ్చే ప్రజలకు సానుకూలతతో సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, ఆర్డీవో వాసుచంద్ర, పీఆర్ఈఈ ఉమేశ్, డీఎస్పీ శ్రీనివాస్, తహసీల్దార్ వెంకటేశ్వరి, ఎంపీడీవో కరీం, కమిషనర్ వెంకటయ్య, సూపరింటెండెంట్ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్

పరిగి ప్రభుత్వాసుపత్రి స్థాయిని 30 పడకల నుంచి వంద పడకలకు అప్‌గ్రేడ్ చేస్తున్నామని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. రూ.28 కోట్లతో నిర్మించనున్న భవన నిర్మాణానికి కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా లేని విధంగా కొత్త ఆస్పత్రి భవనం నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఏ చికిత్స అయినా నగరానికి వెళ్లకుండా ఇక్కడే సేవలు అందేలా చూస్తామని తెలిపారు.

తాండూరు కమిషనర్‌గా యాదగిరి



తాండూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపల్ కమిషనర్‌గా పోస్టింగ్ వెయిటింగ్‌లో ఉన్న గ్రేడ్-3 కమిషనర్ యాదగిరిని నియమిస్తూ మున్సిపల్ పరిపాలన విభాగం జీవో 409 జారీ చేసింది. ఇక్కడ ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్న విక్రంసింహారెడ్డికి జహీరాబాద్ మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టింగ్ ఉండగా తాండూరు ఇన్‌చార్జి కమిషనర్‌గా కొనసాగుతున్నారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఆయన తిరిగి శానిటరీ ఇన్‌స్పెక్టర్ హోదాలో జహీరాబాద్ వెళ్లనున్నారు.

ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ కార్యాలయ భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం బుధవారం వేడుకగా జరిగింది. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు, సీఎస్ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. గచ్చిబౌలిలోని తాలిమ్‌లో నిర్మించే ఈ సముదాయంలో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు శేరిలింగంపల్లి, గండిపేట, రాజేంద్రనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండనున్నాయి.



రిజిస్ట్రేషన్ కార్యాలయ భవన నిర్మాణానికి పూజ చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు

నగర నలువైపులా అభివృద్ధి

ప్రపంచ వేదికగా ఫ్యూచర్ సిటీ

- జంటజలాశయాలకు గోదావరి నీళ్లు
- మూసీ ప్రక్షాళన చేపట్టి తీరుతాం
- అంతర్జాతీయ స్థాయిలో కార్యాలయాల నిర్మాణం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- గచ్చిబౌలిలో సమీకృత రిజిస్ట్రేషన్ కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన



సభకు హాజరైన ప్రజలు, అధికారులు

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగాలంటే నగర నలువైపులా అభివృద్ధితో పాటు, నగర విస్తరణ జరగాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గచ్చిబౌలిలోని తాలిమ్‌లో బుధవారం ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ కార్యాలయ భవన నిర్మాణానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. గచ్చిబౌలిలో భవన సముదాయ నిర్మాణాన్ని అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ రూ.30 కోట్ల సీఎస్ఆర్ నిధులతో చేపడుతోంది. ఇక్కడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతోపాటు శేరిలింగంపల్లి, గండిపేట,

మిగతా 7వ పేజీలో...

రేపు పనుల జాతర ప్రారంభం

వికారాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రేపు(22వ తేదీన) పనుల జాతర ప్రారంభించనున్నటు కలెక్టర్ ప్రతీక్ జైన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా కొత్త పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, గ్రామీణ రోడ్లు, ప్లాస్టిక్ వేస్ట్ యూనిట్లు, కమ్యూనిటీ టాయిలెట్ కాంప్లెక్సుల నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఇందిరా మహిళా శక్తి, ఉపాధి భరోసా కింద స్వయం సహాయ మహిళలకు పశువుల పాకలు, కోళ్ల షెడ్లు, గొర్రెల షెడ్లు, అజోల్లా విట్ల వంటి జీవనోపాధి పనులకు మంజూరైన ఉత్తర్వులను లబ్ధిదారులకు అందజేస్తారన్నారు. మొత్తం 1,366 పనులకు రూ.23.14 కోట్లు మంజూరు కాగా, వీటిలో 43 గ్రామ పంచాయతీ భవనాలు, 46 అంగన్‌వాడీ భవనాలు, 650 పశువుల పాకలు, 94 మేకల పాకలు, 63 కోళ్ల షెడ్లు, 51 చెక్ డ్యాంలు, 214 ఇంకుడు గుంతలు ఉన్నాయన్నారు. గ్రామీణాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యంతో పనులు వేగవంతం చేస్తామని పేర్కొన్నారు.



దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బూర్గుపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఫిజియోథెరపీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, తెలుగు సబ్జెక్టులు ఇంగ్లిష్ మీడియంలో బోధించుటకు మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఉషాకిరణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హతలు కెమిస్ట్రీ, ఫిజిక్స్ బోధించేందుకు ఎంఎస్సీ బీఎడ్, ఫిజియోథెరపీ బోధించుటకు బీపీటీ, ఎంపీటీ అలాగే తెలుగు బోధించుటకు ఎంఏ తెలుగు, బీఎడ్ ఉండాలన్నారు. 21, 22 తేదీల్లో ఇంటర్వ్యూలు, డెమోస్ నిర్వహిండం జరుగుతుందన్నారు. ఆసక్తిల గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 6301013028, 7981718918 నంబర్లను సంప్రదించాలన్నారు.

కార్డుదారులకు పర్యావరణ హిత బ్యాగులు

రేషన్ షాప్‌ల ద్వారా బియ్యంతో పాటు అందజేత





లబ్ధిదారులకు అందించనున్న బ్యాగు

- సెప్టెంబరు నుంచి పంపిణీకి ఏర్పాట్లు
- స్టాక్ పాయింట్లకు చేరిన సంచులు
- బ్యాగులపై ఆరు గ్యారెంటీల ముద్రణ
- ప్రచారంతో పాటు పర్యావరణానికి మేలు

మేడ్చల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/కొడంగల్ రూరల్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ నిషేధానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇప్పటికే వ్యాపార దుకాణాల్లో మున్సిపల్ సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ ప్లాస్టిక్ సంచులను వినియోగించేవారికి పెనాల్టీ విధిస్తున్న సంగతి తెలిసిందే. నిత్యావసరాలకు ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని తగ్గించి పర్యావరణ హితమైన బ్యాగులను వాడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఇక నుంచి రేషన్ దుకాణాల్లో కార్డుదారులకు ఉచితంగా పర్యావరణ హితమైన బ్యాగులను పంపిణీ చేసేందుకు సిద్ధమైంది. కొత్త రేషన్ కార్డులు పొందిన వారికి కూడా సెప్టెంబర్ నెల నుంచి సన్నబియ్యం పంపిణీ చేయాలని పౌరసరఫరాల శాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈసారి లబ్ధిదారులకు బియ్యంతో పాటు ఒక్కో వస్త్రంతో తయారు చేసిన బ్యాగును పంపిణీ చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో జూన్‌లో ఒకేసారి మూడు నెలల కోటా బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన విషయం తెలిసిందే. దీంతో జూలై, ఆగస్టులో రేషన్ దుకాణాలను మూసివేశారు. సెప్టెంబర్ నుంచి మళ్లీ పాత పద్ధతిలో

మిగతా 8వ పేజీలో...

మెరుగైన వైద్య సేవలందించాలి

- మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి
- శామీర్‌పేట సీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



వార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ మను చౌదరి

శామీర్‌పేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలను అందించాలని, అలాగే ఆస్పత్రి పరిసరాల్లో మురికి, దుర్వాసన లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. శామీర్‌పేటలోని సామాజిక ఆరోగ్య కేంద్రం(కమ్యూనిటీ హెల్త్ సెంటర్)ను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డులు, ల్యాబ్‌లు, లేబర్ రూమ్‌లను, స్టోర్‌ను, ఇలా అన్ని విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. ఆస్పత్రికి ప్రహరీ నిర్మించి గేటు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అత్యంత అవసరమైన వసతుల కల్పనకు తనకు వెంటనే నివేదికలు పంపాలని ఆ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. కాగా, ఆస్పత్రి పైకప్పు నుంచి వాటర్ లీకేజీ అవుతుందని, బెడ్స్ కొరత ఉందని, టాయిలెట్స్ నిర్వహణ లేదని, డ్రైనేజీ సమస్య ఉందని మెడికల్ ఆఫీసర్ కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన కలెక్టర్ ఆస్పత్రి భవనంపై నుంచి నీరు లీకేజీ కాకుండా రేకులతో షెడ్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వాష్‌రూమ్స్ నిర్వహణకు, డ్రైనేజీ, బెడ్స్ ఏర్పాటుకు, అవసరమైన నిధులను త్వరలోనే మంజూరు చేస్తానని తెలిపారు. అలాగే ఫీవర్ సర్వే జరుగుతుందా? డెంగీ కేసులు ఎన్ని ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు.

త్వరలో అమృత్ భారత్ పనులు పూర్తి

సౌత్ సెంట్రల్ రైల్వే డీఆర్ఎం డాక్టర్ గోపాలకృష్ణన్



వినతిపత్రం ఇస్తున్న స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు

తాండూరు,ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): త్వరలో అమృత్ భారత్ పనులు పూర్తి చేస్తామని సౌత్ సెంట్రల్ రైల్వే డీఆర్ఎం డాక్టర్ గోపాలకృష్ణన్ అన్నారు. బుధవారం ఆయన తాండూరు రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేశారు. ప్రత్యేక రైల్లో తాండూరుకు చేరుకున్న ఆయన అమృత్ భారత్ కింద జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వర్షాలు పడుతుండటంతో పనుల్లో జాప్యం జరుగుతుందన్నారు. త్వరలో పనులు పూర్తి చేయించి ప్రయాణికులకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. కాగా, స్థానికంగా స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు రైళ్ల గురించి ఇచ్చిన పలు వినతులను పరిశీలిస్తామని తెలిపారు.

పుష్‌పుల్ రైలును పునరుద్ధరించాలి

తాండూరు - హైదరాబాద్‌కు ప్రతి రోజు వేలాది మంది ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు ప్రయాణం చేస్తున్నారని వారి సౌలభ్యం కోసం ఉదయం 7 గంటలకు తాండూరు నుంచి హైదరాబాద్, సాయంత్రం 7 గంటలకు హైదరాబాద్ నుంచి తాండూరుకు పుష్‌పుల్ రైలును నడిపించాలని మార్వాడీ యువ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు మన్మోహన్ సార్దా, తాండూరు శాఖ అధ్యక్షులు అనిల్ సార్దా, కార్యదర్శి సచిన్ రాఠి, విజయ్ ప్రకాశ్ తదితరులు డీఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు. గతంలో పుష్‌పుల్ రైలు నడిచేదని కరోనా తర్వాత నిలిపి వేశారని వారు పేర్కొన్నారు. అలాగే హుబ్లీ, బిజాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో రిజర్వేషన్ బోగీల సంఖ్య పెంచాలని యశ్వంత్‌పూర్ - గోరక్‌పూర్, యశ్వంత్‌పూర్ - కటారా , భువనేశ్వర్ - పుణె రైళ్లను తాండూరులో ఆపాలని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించి అధికారులను పరిశీలించాలని ఆదేశించారు.



కూలిన ఇళ్లు..

మునిగిన పంటలు

ధ్వంసమైన రోడ్లు

ప్రజలకు తప్పని ఇక్కట్లు

8

ఏసీబీ దాడులతో షాక్

విధులకు హాజరుకాని బల్దియా అధికారులు

గంటసేపు డ్యూటీకొచ్చిన కమిషనర్

7

ప్రాజెక్టుల నిర్మాణాలే లక్ష్యం

కృష్ణా, గోదావరి అనుసంధానంతో పరిగికి నీరు.. డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

పరిగి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సాగు, తాగు నీరు ప్రాజెక్టుల నిర్మాణాలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం పరిగిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు సాగునీటి ప్రాజెక్టుల విషయంలో తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డిని తుంగలో తొక్కిందని, చేవెళ్ల - ప్రాణహితను మెదక్‌కు దారి మళ్లించారని మండిపడ్డారు. ఈ రెండు ప్రాజెక్టుల వచ్చే నీటిని పరిగిలో అనుసంధానం చేసే అంశాన్ని ప్రభుత్వం ఆలోచిస్తుందని తెలిపారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుపై కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, ఇప్పుడు ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కొత్తగా డీపీఆర్‌ను సిద్ధం చేసిందని తెలిపారు. కేపీ లక్ష్మీదేవిపల్లి దగ్గర 2.8టీఎంసీల సామర్థ్యంతో మరో రిజర్వాయర్ రానుందన్నారు. ఇప్పటికే ఆర్థిక శాఖ నిధులు కేటాయించిందన్నారు. కాల్వలవల ద్వారా భవిష్యత్తులో ఈ ప్రాంతానికి సాగునీరు అందిస్తామని చెప్పారు. కృష్ణ- గోదావరి నదులను జిల్లాలోనే అనుసంధనం చేసి, గ్రావిటీ ద్వారా జిల్లాలకు సాగు, తాగునీరు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ట్రిపుల్ ఆర్ పరిగి మీదుగా వెళ్తుందని, దాని పక్కనే రైలు మార్గం కూడా ఏర్పాటు కానుందన్నారు. నియోజకవర్గంలోని ప్రతీ పంచాయతీకి తారు రోడ్డు ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు.

తొలగిన అడ్డంకులు

మన్నెగూడ-అప్పా జంక్షన్ వరకు నాలుగు లైన్‌లో రోడ్డుకు అండ్డంకులు తొలగిపోయాయని, పనులు వేగవంతం కానున్నాయన్నారు. కొత్తగా మన్నెగూడ - కొడంగల్ రావులపల్లి వరకు నాలుగులైన్‌రోడ్డు కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. పరిగి-షాద్‌నగర్, పరిగి-వికారాబాద్ వరకు నాలుగు లేన్ల రోడ్ల నిర్మాణానికి పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. గడిసింగాపూర్-రంగారెడ్డిపల్లి, వెంకట్‌రెడ్డిపల్లి నుంచి లాల్‌పహాడ్ వరకు డబల్ లైన్ రోడ్డు పనులు కూడా ప్రగతిలో కొనసాగుతున్నాయని తెలిపారు.

ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలం

వికారాబాద్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఎరువుల సరఫరాలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, గత కేసీఆర్ పాలనలో ఎరువుల విషయంలో ఎక్కడా ఇబ్బంది తలెత్తలేదని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అని చెప్పుకొని తిరుగుతూ ప్రజల కష్టాలను గాలికొదిలిందన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. యూరియా కోసం రైతులు అధికారులు, ఫర్టిలైజర్స్ దుకాణాల వారి కాళ్లవేళ్లా పడుతున్నా కావాల్సినంత యూరియా అందించడం లేదన్నారు.

కుక్కలకు జనన నియంత్రణ ఆపరేషన్లు


పరిగిలో కుక్కలకు సర్జరీ చేస్తున్న డాక్టర్లు

పరిగి,ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పరిగిలోని అనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రంలో బుధవారం కుక్కలకు ఆపరేషన్‌లు చేశారు. కుక్కల జనన నియంత్రణ ఆపరేషన్లు చేసినట్లు మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య తెలిపారు. ఈ సర్జరీలు నిరంతరం కొనసాగుతాయన్నారు. ఈ కేంద్రాన్ని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సందర్శించి సూచనలు చేశారు. కార్యక్రమంలో పశువైద్యుడు అంకంరాజు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి


ఇబ్రహీంపట్నం : మాట్లాడుతున్న జీఎస్ కోహ్లీ

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ కెరీర్‌ను వృద్ధి చేసుకుంటూ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, అందుకు అవసరమైన సహకారం, నైపుణ్యం తమ విద్యాసంస్థలు అందిస్తాయని గురునానక్ విద్యాసంస్థల వైస్ ఛైర్మన్, గురునానక్ యూనివర్సిటీ చాన్స్‌లర్ సర్దార్ గగనదీప్‌సింగ్ కోహ్లీ అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ విద్యాసంస్థల్లో బుధవారం ఓరియంటేషన్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎండీ డా.హెచ్.ఎస్.సైనీ మాట్లాడుతూ విద్య సప్రణాళిక, పరిశోధనా అవకాశాలు అందిచడానికి ఎప్పుడూ ముందుంటామని, భవిష్యత్‌కు బాటలు వేసుకోవడమనేది విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రయాగ్ కన్స్యూమర్ కేర్ చీఫ్ హెచ్‌ఆర్‌వో ఎస్.కృష్ణవాసన్, నోబుల్‌క్యూ కంపెనీ జనరల్ మేనేజర్ నరేష్ పెరుగు, గురునానక్ విద్యాసంస్థల డైరెక్టర్లు, డీన్‌లు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి

ప్రణాళికాబద్ధంగా చదివితేనే అనుకున్న లక్ష్యాన్ని ఛేదిస్తామని సైయంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఛైర్మన్ డా.కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నంలోని కళాశాలలో బుధవారం బీటెక్ ఫస్టియర్ స్టూడెంట్స్‌కు ఓరియంటేషన్‌డే కార్యక్రమం నిర్వహించగా ఆయన పాల్గొని మార్గనిర్దేశనం చేశారు. టీసీఎస్ ప్రొఫెసర్ సూర్యనారాయణ మాట్లాడుతూ మంచి ఇంజనీర్ కావడమనేది విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. ప్రిన్సిపాల్ డా.జి. అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పరిశోధనలు సమాజానికి ఉపయోగపడాలి

మొయినాబాద్ రూరల్ : పరిశోధనలు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ ఛైర్మన్ డాక్టర్ పురుషోత్తంరెడ్డి అన్నారు. హిమాయత్ నగర్‌లోని యూనివర్సిటీ ఫార్మసీ విభాగానికి చెందిన కె.బాలరాజు 'అనాలిటికల్ మెథడ్ అండ్ వాలిడేషన్ ఆఫ్ సెలెక్టెడ్ డ్రగ్స్ బై యూజింగ్ అడ్వాన్స్‌డ్ హై ఫెనాటెడ్ టెక్నిక్స్ అండ్ అకంప్లిషింగ్ ది రెగ్యులేటరీ సబ్మిషన్ రిక్వైర్‌మెంట్స్ ఇన్ ది రెగ్యులేటెడ్ మార్కెట్స్' అంశంపై డాక్టర్ కంజర్ల నర్సింహ పర్యవేక్షణలో పరిశోధన చేయగా బాలరాజు పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. మెకానికల్ విభాగానికి చెందిన సురం రాజు 'ఎక్స్‌పరిమెంటల్ ఇన్వెస్టిగేషన్ ఆన్ పార్మమెన్స్ ఎమిషన్ అండ్ కంబుషన్ క్యారెక్టరిస్టిక్స్ ఆఫ్ డైరెక్ట్ ఇంజక్షన్ డీజిల్ ఇంజిన్ యూజింగ్ వరియస్ బ్లెండెడ్ బయోడీజిల్స్' అంశంపై ఈ విభాగం సూపర్‌వైజర్ ప్రొ.మోహన్, కో-సూపర్‌వైజర్‌ల ఆధ్వర్యంలో పరిశోధన చేయగా సురం రాజుకు పీహెచ్‌డీ ప్రదానం చేశారు. ఈమేరకు బాలరాజు, సురం రాజులకు యూనివర్సిటీ ఛైర్మన్ డా.పురుషోత్తంరెడ్డి బుధవారం యూనివర్సిటీలో పట్టాలను ప్రదానం చేశారు.

ఇద్దరు లెక్చరర్లకు డాక్టరేట్

కందుకూరు : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న ఇద్దరు లెక్చరర్లు డాక్టరేట్ అందుకోవడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ జి.మంగరాజు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం వారిని ఘనంగా సన్మానించారు. తమ కళాశాలలో పనిచేస్తున్న ఫిజికల్ డైరెక్టర్ ఎం.పర్వతాలుగౌడ్ ఢిల్లీలోని ఎస్వీ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నట్లు గుర్తుచేశారు. హిందీ లెక్చరర్‌గా పనిచేస్తున్న వై.శారద ఉస్మానియా నుంచి డాక్టరేట్ అందుకున్నారని తెలిపారు.

తలకొండపల్లి వాసికి ఆంగ్లంలో పీహెచ్‌డీ

తలకొండపల్లి: మండల కేంద్రానికి చెందిన కర్నోని జంగయ్య ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. యూనివర్సిటీ 84వ స్నాతకోత్సవంలో భాగంగా జంగయ్యకు ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి. నారాయణన్, వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. డాక్టర్ మృదుల లక్కరాజు ఆధ్వర్యంలో డయాస్పొరా అండ్ నాస్టాల్జియా ఇన్ సెలెక్టెడ్ నావెల్స్ ఆఫ్ బుచిఎమచేట అండ్ చిమమాండ జోస్జీ అనే అంశంపై ఆంగ్లంలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ అందుకున్నారు. జంగయ్య ప్రస్తుతం బీసీ గురుకులంలో ఆంగ్లం బోధిస్తున్నారు.


కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

వైభవంగా మహాకుంభ ప్రోక్షణ

● లక్ష్మీ వేంకటేశ్వరాలయంలో ముగిసిన ఉత్సవం

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పెద్ద జానమ్మపేట శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అంగరంగవైభవంగా మహాకుంభ ప్రోక్షణ, స్వామికి అభిషేకాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో చివరి రోజు సుదర్శన నారసింహ హోమాన్ని, స్వామికి శతఘటాభిషేకాన్ని నిర్వహించారు. యాగశాల నుంచి కలశాలను, పవిత్ర మాలలను ఊరేగింపుగా తీసుకువచ్చి, ఆలయ శిఖరంపై బక్కని నర్సింహులు మహాకుంభ ప్రోక్షణ చేశారు. వేద పండితులు వేంకటేశ్వరుడికి అభిషేకం చేసి, పునఃదర్శన భాగ్యాన్ని కల్గించారు. ఆలయ గర్భగుడిలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించి 25 సంవత్సరాలు గడుస్తున్నందున ఆరు రోజులు నిర్వహించిన మహాకుంభ ప్రోక్షణ, పవిత్రోత్సవం, హోమాలకు దాతలు ముందుకురావడం, అధిక సంఖ్యలో భక్తులు హాజరుకావడం పట్ల బక్కని సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ ప్రధాన పూజారి శ్రీనివాసచార్యుల ఆధ్వర్యంలో ఉత్సవం నిర్వహించిన వేదపండితులను సన్మానించి, ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం స్వామివారి కాల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్ నన్నూరి నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, కాట్రగడ్డ ప్రసూన, పారిశ్రామికవేత్తలు జితేందర్ కేడియా, శ్రీ కిషన్ అగర్వాల్, సురేంద్ర, మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ బాబర్‌ఖాన్, బీజేపీ నాయకులు అందె బాబయ్య, చెంది మహేందర్ రెడ్డి, పట్టణ ప్రముఖులు పలబట్ల బాల్‌రాజ్‌గౌడ్, పి.వెంకటసాయిశ్వర్ రెడ్డి, పాతూరి వెంకటరావు, ఒగ్గు కిషోర్, కానుగు రాంభూపాల్, కానుగు అంతయ్య, టి.ప్రతాప్‌రెడ్డి, గంధం ఆనంద్, చెంది తిరుపతిరెడ్డి, గజవాడ నర్సింహులు, పి.జగన్‌మోహన్‌రావు, దండు శరత్‌చంద్రబాబు, గంధం శేఖర్, రాయల శంకర్, ఈగ వెంకటరాంరెడ్డి, రాజ్‌గోపాల్, బెంది సురేందర్‌రెడ్డి, ఆర్.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణపై అవగాహన

తాండూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): తాండూరు సాయిపూర్‌లోని భవానీ నగర్‌లో బుధవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మలేరియా నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్లీచింగ్ పౌడర్‌ను చల్లి, దోమల నివారణ మందు పిచికారీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ అక్షయ్, ఏఎన్ఎం సుధాలక్ష్మి, మాజీ వైస్‌ఛైర్మన్ రత్నమాల ఉన్నారు.

యూరియా కొరత సృష్టిస్తే చర్యలు

బొంరాస్‌పేట్/కొడంగల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఫర్టిలైజర్స్ దుకాణదారులు యూరియా కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి అన్నారు. బుధవారం బొంరాస్‌పేట్, కొడంగల్ మండల కేంద్రాల్లో ఫర్టిలైజర్స్ దుకాణాలను అధికారులతో కలిసి తనిఖీ చేశారు. రికార్డులు, నిల్వలు పరిశీలించారు. ఎరువుల కోసం రైతులకు ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అమ్మాలన్నారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయ అధికారి రాజరత్నం, కొడంగల్ ఏడీఏ శంకర్‌రాథోడ్, తదితరులు ఉన్నారు.

నానో యూరియాతో అధిక లాభాలు

దుద్యాల: రైతులు నానో యూరియా వాడితే అధిక లాభాలు పొందొచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాజరత్నం, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి అన్నారు. దుద్యాలలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. నానో యూరియాపై అవగాహన కల్పించారు. కొడంగల్ ఏడీఏ శంకర్‌రాథోడ్, ఏవో నాగరాజు ఉన్నారు.


బొంరాస్‌పేట్‌లో తనిఖీ చేస్తున్న హర్ష్‌చౌదరి, వ్యవసాయ అధికారులు



అలేఖ్యను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జాతీయ స్థాయి పోటీలకు అలేఖ్య

యాచారం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అండర్ - 15 వాలీబాల్ పోటీలకు యాచారం ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని అలేఖ్య ఎంపికైంది. ఇటీవల ఇబ్రహీంపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. ఈనెల 25న పూణేలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం గర్వకారణమని పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం అలేఖ్యను ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింహ, హాస్టల్ వార్డెన్ సరిత, ఉపాధ్యాయులు భోజయ్య, ఆనంద్‌జోషి, గోవర్ధనాచారి, సీతారాం, వెంకటరెడ్డి, నీరజ, పద్మావతి. మమత, శ్రీదేవి, విజయకుమారి, జగదీష్‌కుమార్ పాల్గొన్నారు.

జనాభా దామాషా ప్రకారం
రిజర్వేషన్లు కేటాయించాలి

షాబాద్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని అంతారంలో బీసీ సేన గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంతారం గ్రామ అధ్యక్షుడిగా రాజేందర్, ఉపాధ్యక్షులుగా నవీన్, ప్రధాన కార్యదర్శిగా మహేష్‌లను ఎన్నుకున్నారు. కృష్ణ మాట్లాడుతూ.. ఆర్.కృష్ణయ్య 45 ఏళ్లుగా బీసీల అభివృద్ధే లక్ష్యంగా అలుపెరుగని కృషి చేస్తున్నారని అన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సుధాకర్, మండలాధ్యక్షుడు దయాకర్‌చారి, ఉపాధ్యక్షుడు బాల్‌రాజ్, యూత్ అధ్యక్షుడు అజయ్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వర్షంలోనూ సరిచేయాల్సిందే..

కేశంపేట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వర్షం కురుస్తుంటే సాధారణంగా ప్రజలంతా ఇంట్లో ఏంచక్కా ఏ టీవీ చూస్తూనో కాలక్షేపం చేస్తూ ఉంటారు. అలాంటిది విద్యుత్ అధికారులు, వర్షం పడుతున్న సమయంలో కూడా విద్యుత్ స్తంభాలు ఎక్కి మరమ్మతులు చేపట్టడం సాహసమనే చెప్పాలి. కేశంపేట మండలం చింతకుంటపల్లిలో మంగళవారం రాత్రి గాలివనకు విద్యుత్ తీగల మీద వేపచెట్టు కూలింది. చెట్టు బరువుకు రెండు స్తంభాలు విరిగిపోయాయి. బుధవారం వర్షాన్ని లెక్కచేయకుండా మరమ్మతులు చేపట్టారు. అనంతరం విద్యుత్ వైర్లను బిగించారు. ఈమేరకు అధికారులు, సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు.

విద్యార్థులు జ్ఞానం కోసం చదవాలి

ఘట్‌కేసర్, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మార్కుల కోసమే కాకుండా జ్ఞాన సముపార్జన కోసం చదవాలని జేఎన్టీయూ(హెచ్) కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ విభాగాధిపతి కేపీ సుప్రీతి అన్నారు. బుధవారం కొండాపూర్‌లోని సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ ఫస్టియర్ విద్యార్థుల ఓరియేంటేషన్ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. ప్రాక్టికల్స్‌కు ప్రాధాన్యమిస్తూ కోర్సు పూర్తిచేయాలన్నారు. మొబైల్ వాడకాన్ని తగ్గించి చదువుపై దృష్టి సారిస్తేనే ఫలితాలొస్తాయన్నారు. క్రమశిక్షణతో శ్రమిస్తే సాధించలేనిదేదీ లేదన్నారు. సైకాలజిస్ట్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్ అభిషేక్ మాట్లాడుతూ.. ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్తే అనుకున్నది సాధిస్తారన్నారు. ప్రతిభను ప్రదర్శిస్తూ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ ఏవీ రమణారావు, డైరెక్టర్ ఎం.రమాకాంత్‌రెడ్డి, ప్రినిపాల్ జానకిరాములు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక సేవలతోనే గుర్తింపు



వైకుంఠ రథాన్ని ప్రారంభిస్తున్న వజ్రేశ్‌యాదవ్

శామీర్‌పేట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మానవతా దృక్పథంతో సమాజానికి సేవలు చేస్తే మంచి గుర్తింపు వస్తుందని మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్ అన్నారు. బుధవారం శామీర్‌పేటలో మాజీ ఎంపీటీసీ డప్పు సాయిబాబ అతడి తండ్రి బిక్షపతి జ్ఞాపకార్థం అందజేసి కొత్త వైకుంఠ రథాన్ని వజ్రేశ్‌యాదవ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. దాతలు మానవ సేవే మాధవ సేవగా భావించి సేవలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నర్సింహాయాదవ్, జిల్లా ఆర్టీఏ మెంబర్ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, నాయకులు కిషోర్‌యాదవ్, కృష్ణారెడ్డి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనివర్సిటీ అధికారులు, అధ్యాపకులు

విద్యతోపాటు ఉపాధి అవకాశాలు

కొడంగల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో విద్యతో పాటు ఉపాధి అవకాశాలు లభిస్తాయని విద్యార్థి సేవా విభాగం డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. కొడంగల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్‌ను డైరెక్టర్, ప్రొఫెసర్ దయాకర్ మంగళవారం సందర్శించారు. వారు మాట్లాడుతూ.. యూనివర్సిటీలో విద్యనభ్యసించే విద్యార్థులు నెలకు రూ.7వేల నుంచి 19వేల వరకు సంపాదించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. వృత్తి విద్యతో ఉపాధి పొందేలా రుణసదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పోస్టర్‌ను ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి



చేవెళ్ల : పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

శంకర్‌పల్లి/చేవెళ్ల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సీపీఎస్‌ను ప్రభుత్వం రద్దు చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శంకర్‌పల్లి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బుధవారం సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ తలపెట్టిన ధర్నా పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. చేవెళ్ల ఎంఈవో పురందాస్, పీఆర్‌టీయుటీఎస్ చేవెళ్ల మండలాధ్యక్షుడు దయానందం, గౌరవాధ్యక్షుడు నర్సింహరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

కేశంపేట : పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పీఆర్టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు కన్నయగారి గోవర్ధన్ యాదవ్ డిమాండ్ చేశారు. అనంతరం పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలాధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ రెడ్డి, గౌరవాధ్యక్షుడు గోవర్ధనచారి, బాలేశ్వర్ పాల్గొన్నారు.

నగర నలువైపులా అభివృద్ధి

(ఐదో పేజీ తరువాయి)

రాజేంద్రనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉంటాయి.

జంట జలాశయాలకు 20 టీఎంసీలు

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ మహానగర విస్తరణ, అభివృద్ధి గురించి పలు ప్రణాళికలను వివరించారు. మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు చేపట్టి తీరుతామని, హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జంట జలాశయాలకు గోదావరి జలాలను తరలిస్తామని ప్రకటించారు. రానున్న రోజుల్లో ఈ జలాశయాలకు గోదావరి నుంచి 20 టీఎంసీల నీటిని తరలిస్తామన్నారు. ప్రపంచ వేదికగా భారత్ ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకుంటుందన్నారు. ఆదాయాన్ని ఇచ్చే రిజిస్ట్రేషన్ కార్యాలయాల రూపురేఖలు మార్చే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. అన్ని సౌకర్యాలతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మిస్తున్నామని, అధునాతన సౌకర్యాలతో అంతర్జాతీయ స్థాయిలో కార్యాలయాలను నిర్మించనున్నట్లు తెలిపారు. ఉపాధి కోసం వచ్చేవారికి ఆశ్రయం ఇవ్వడమే కాకుండా అన్ని సౌకర్యాలను నాటి ప్రభుత్వాలు కల్పించడం వల్లే ఈ ప్రాంతం గొప్పగా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు: మంత్రి పొంగులేటి

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు సాగుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రజల నమ్మకాన్ని వొమ్ము చేయకుండా ప్రగతి సాధనలో ముందుకు సాగుతున్నామని, ఈమేరకు ఒక్కొక్కటిగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగానే ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ భవనాల శంకుస్థాపన అని అన్నారు. నగర ప్రజలకు స్వచ్ఛమైన, నీరు గాలి రావాలనే ఉద్దేశంతో మూసీని ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం పూనుకుందన్నారు. సీఎం ఆలోచన మేరకు ప్రజలకు సరళీకృతమైన సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి ఆదాయాన్ని కల్పించే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో సీఎం రేవంత్‌రెడ్డి కనీవినీ ఎరగని రీతిలో మార్పులు తీసుకువస్తున్నారన్నారు. ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ, ఓఆర్ఆర్ పరిధిలోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ల రూపంలో సుమారు 62 నుంచి 63 శాతం ఆదాయం వస్తోందన్నారు. అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించే ఈ భవనాలు ఎనిమిది నెలల్లోగా పూర్తి చేసి సీఎం రేవంత్ రెడ్డి చేతులమీదుగా ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ స్పెషల్ సెక్రటరీ రాజీవ్‌గాంధీ హన్మంత్, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఉన్నతాధికారులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



నూతన జంటతో సీఎం రేవంత్‌రెడ్డి

ఘనంగా సీఎం సోదరుడి కుమార్తె నిశ్చితార్థం

- హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

శంకర్‌పల్లి/చేవెళ్ల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి కుమార్తె నిశ్చితార్థ కార్యక్రమం బుధవారం రాత్రి శంకర్‌పల్లి మండల పరిధిలోని జన్వాడ రెవెన్యూ పరిధిలోని కె.కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది. ఎనుముల మంజుల, తిరుపతిరెడ్డిల కుమార్తె ఎనుముల రచన నిశ్చితార్థం, మోడుగు అర్పిత గోపాల్‌రెడ్డిల కుమారుడు అన్నమన్‌తో పెద్దల సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు నూతన జంటను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమానికి ఇరువురు కుటుంబ సభ్యులు, మంత్రులు, రాజకీయ పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, సీతక్క, నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల కలెక్టర్లు నారాయణరెడ్డి, ప్రతీక్‌జైన్, చేవెళ్ల ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, మనోహర్‌రెడ్డి, యాదయ్య, యశశ్విని రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంత్‌రావు, కొదండా రాంరెడ్డి, హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాల్లో డీజేలు వాడొద్దు

యాచారం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): గణేశ్ ఉత్సవాల్లో భాగంగా మండపాల వద్ద ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలు పెట్టరాదని, నిమజ్జనం రోజు డీజేలు వాడితే నిర్వాహకులపై చర్యలుంటాయని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో వివిధ గ్రామాల గణేశ్ ఉత్సవ కమిటీలతో నవరాత్రుల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. మండపానికి అక్రమంగా విద్యుత్ వాడరాదని, శాంతియుతంగా గణేశ్ వేడుకలు జరుపుకోవాలని అన్నారు. మండపాల పరిసరాల్లో సిబ్బందితో శుభ్రం చేయించనున్నట్లు ఎంపీడీవో రాధారాణి తెలిపారు. యాచారం, హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐలు ఎ.నందీశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ, ఎస్సై మధు పాల్గొన్నారు.

మట్టి వినాయకులనే ప్రతిష్ఠించాలి

మహేశ్వరం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): హిందువులందరూ గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మట్టి గణపతులను మాత్రమే ప్రతిష్ఠించాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) అన్నారు. బుధవారం తుక్కుగూడలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చెరువులను, ప్రకృతిని పరిరక్షించుకోవాలంటే రంగురంగుల విఘ్నేశ్వరులకు స్వస్తి పలికి.. మట్టి వినాయకుల ఏర్పాటుకు ప్రతీ ఒక్కరు ముందుకు రావాలన్నారు. ప్రకృతి వనరులను ఏ విధంగా కాపాడుకోవాలనే అంశాలపై ఇప్పటికే లీడ్ ఇండియా ద్వారా ఏపీజే అబ్దుల్ కలామ్ స్ఫూర్తిని, నైపుణ్య శిక్షణను రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల విద్యార్థులకు తెలియజేస్తున్నామన్నారు.

బాల కార్మికులకు విముక్తి

- జార్ఖండ్ నుంచి తెలంగాణకు అక్రమంగా తరలింపు
- రంగంలోకి దిగిన జాతీయ హెచ్ఆర్‌సీ బృందం

కొందుర్గు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జార్ఖండ్ నుంచి తెలంగాణకు అక్రమంగా తరలించిన ఆరుగురు బాల కార్మికులను గుర్తించి వారికి విముక్తి కల్పించిన ఘటన బుధవారం రంగారెడ్డి జిల్లా కొందుర్గు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సైబరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమ పిల్లలను పరిశ్రమల్లో పనులు కల్పిస్తామని చెప్పి అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలించారని వారి వారి తల్లితండ్రులు జార్ఖండ్ రాష్ట్రం బోరియో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్రమత్తమైన అక్కడి పోలీసులు యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ సెక్షన్ 43 ప్రకారం 62/2025 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. బాల బాలికలను ఇతర రాష్ట్రాలకు తరలించిన విషయం ఆ రాష్ట్రంలో దావనంలా వ్యాపించడంతో జాతీయ మానవహక్కుల సంఘం రంగంలోకి దిగింది. బాల బాలికలను ఏ రాష్ట్రానికి తరలించారన్న విషయంపై ఆరా తీయగా జార్ఖండ్ నుంచి రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం రాంచంద్రాపురానికి తరలించి సమీపంలో ఉన్న ఒక పరిశ్రమలో పని చేయిస్తున్నట్లుగా గుర్తించారు. ఈ విషయాన్ని ఎన్‌ఎచ్‌ఆర్‌సీ బృందం సభ్యులు సైబరాబాద్ కమిషనరేట్‌లో మంగళవారం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. కమిషనరేట్‌లో ఉన్న పోలీస్ ఉన్నతాధికారులు కొందుర్గు పోలీసులకు సమాచారం అందించి జాతీయ మానవ హక్కుల బృందానికి సహకరించాల్సిందిగా ఆదేశించారు. రాంచంద్రాపూరం సమీపంలో ఒకగెస్ట్ హౌస్‌లో ఉంచినట్లు సమాచారం అందుకున్న కొందుర్గు పోలీసులు ఎన్‌హెచ్‌ఆర్‌సీ బృందానికి సమాచారం ఇచ్చి గెస్‌హౌస్‌పై దాడులు నిర్వహించారు. జార్ఖండ్‌కు చెందిన ఐదుగురు బాలికలు, ఒక బాలుడిని ఎన్‌హెచ్‌ఆర్‌సీ బృందానికి అప్పగించారు. వారిని బృందం సభ్యులు జార్ఖండ్ రాష్ట్రానికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

మహిళాభ్యున్నతికి ప్రభుత్వం పెద్ద పీట

దోమ/కులకచర్ల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం దోమ రైతు వేదికలో మహిళలకు కుట్టుమిషన్‌లు, ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లను పంపిణీ చేశారు. శివారెడ్డిపల్లిలో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన, సీసీ రోడ్ల ప్రారంభోత్సవం, రత్నానాయక్ తండాలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను ప్రారంభించారు. నియోజకవర్గానికి 3,500ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ ఏడీ బాబు మోజెస్, తహసీల్దార్ గోవిందమ్మ, ఎంపీడీవో గ్యమానాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ యాదవరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, శాంత్‌కుమార్, నాయకులు శివకుమార్‌రెడ్డి, రాములునాయక్, రాఘవేందర్‌రెడ్డి, యాదయ్య, వెంకటయ్య పాల్గొన్నారు. కులకచర్లలో ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లు, కుట్టు మిషన్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఎంపీడీవో రామకృష్ణ, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ మొగులయ్య, వైస్‌చైర్మన్ నాగరాజు, నాయకులు భరత్‌కుమార్, గోపాల్‌నాయక్, చౌడాపూర్ మండలాధ్యక్షుడు అశోక్, సత్యమ్మ, అంజిలయ్యగౌడ్, వెంకటయ్యగౌడ్, రవినాయక్, విఠల్‌నాయక్ పాల్గొన్నారు.

ఏసీబీ దాడులతో షాక్

- విధులకు రాని బల్దియా అధికారులు
- గంటసేపు డ్యూటీకొచ్చిన కమిషనర్

తాండూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపాలిటీలో మంగళవారం ఏసీబీ దాడులు నిర్వహించి ఆర్ఐ రమేష్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడంతో మున్సిపల్ అధికారులు బుధవారం కార్యాలయానికి రాలేదు. మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ విక్రంసింహారెడ్డి మంగళవారం నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు ఫోన్ స్విచాఫ్ చేశారు. మధ్యాహ్నం తర్వాత గంటసేపు ఆఫీసుకొచ్చి వెళ్లిపోయారు. కార్యాలయ పలు విభాగాల అధికారులు డ్యూటీకి రాలేదు. రెవెన్యూ సెక్షన్ గదికి తాళం వేశారు. ఇదిలా ఉంటే మున్సిపాలిటీలో ఒక్క రెవెన్యూ సెక్షన్‌లోనే వారానికి రూ.2లక్షల వరకు మామూళ్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలొస్తున్నాయి.

ఇన్‌చార్జి కమిషనర్‌పైనా ఫిర్యాదు...

మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ విక్రంసింహారెడ్డికి అవినీతిలో భాగస్వామ్య ఉందని తాను ఏసీబీకి ఫిర్యాదు చేశానని బాధితుడు ఇర్షాద్ తెలిపారు. ఏసీబీకి పట్టుబడిన రమేష్‌తో కమిషనర్ ఉన్నారని ఏసీబీకి స్టేట్‌మెంట్ ఇచ్చానని తెలిపారు. ఇంటి నంబర్ కేటాయింపు లాగిన్ కమిషనర్ చేతుల్లోనే ఉంటుందని, తానిచ్చిన 15వేల లంచంలో రూ.5వేలు కమిషనర్‌కు రూ.2వేలు వార్డు బిల్ కలెక్టర్‌కు ఇవ్వాల్సి ఉంటుందని రమేషే తనకు చెప్పాడని ఏసీబీ అధికారులకు తెలిపానని వివరించారు. ఇన్‌చార్జి కమిషనర్ పైనా ఏసీబీ విచారణ ప్రారంభించింది. కాగా తనకు తనకు రక్షణ కల్పించాలని ఇర్షాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం

శంకర్‌పల్లి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): దేశంలో అనేక నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టిన ఘనత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకే దక్కుతుందని, ఆయన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతరావు తెలిపారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా బుధవారం శంకర్‌పల్లి మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శానిటరీ నాప్కిన్స్‌ను పంపిణీ చేశారు. అనంతరం చందిప్ప గ్రామంలోని మరకత శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా అధ్యక్షురాలు జ్యోతి భీమ్‌భరత్, జిల్లా కమిటీ సభ్యులు, నాయకులు తదితరులు ఉన్నారు.


అభివృద్ధిలో వర్సిటీలు కీలకపాత్ర పోషించాలి

ఘట్‌కేసర్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సుస్థిర అభివృద్ధి సాధనకు ఉన్నత విద్యాలయాలు కీలకపాత్ర పోషించాలని మాస్‌టెక్ డిజిటల్ చీఫ్ డెలివరీ ఆఫీసర్ జితేంద్ర చక్రవర్తి అన్నారు. బుధవారం యంనంపేట్‌లోని శ్రీనిధి యూనివర్సిటీ ఓరియంటేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విశ్వవిద్యాలయాలు ఆవిష్కరణలు, సామాజిక మార్పు, ఆర్థికాభివృద్ధి ఇంజిన్లు అన్నారు. లక్ష్యసాధనకు నిరంతరం శ్రమించాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రెసిడెంట్ అభిజిత్‌రావు, ప్రోచాన్సలర్ నర్సింహారెడ్డి, రిజిస్ట్రార్ చంద్రశేఖర్, డీన్ కార్తికేయన్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల తరలింపు సరికాదు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సమీకృత భవనాల నిర్మాణం పేరిట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను వేరేచోటకు తరలించడం సమంజసం కాదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. పాలనను ప్రజల నుంచి దూరంగా తీసుకుపోవడంలాంటి చర్యలు కాంగ్రెస్ ప్రభుత్వానికి రివాజుగా మారిందన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇబ్రహీంపట్నంలో ఉండే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంఖాలకు తరలించేలా నిర్ణయించడంపై ఆయన కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఇబ్రహీంపట్నంలోనే తాము సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణానికి నిధులు మంజూరుచేసి కొంతమేర నిర్మాణం జరిపినట్లు ఆయన చెప్పారు. ఈ భవనాన్ని పూర్తి చేయకుండా తరలించడమేంటని ప్రశ్నించారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఏజీతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు చెప్పారు. కొహెడలో నిర్మించతలపెట్టిన సమీకృత భవనానికి గాకుండా ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంఖాలకు తరలిస్తామంటే ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. ఆయనతో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న మంచిరెడ్డి

కూలిన ఇళ్లు.. మునిగిన పంటలు

● ధ్వంసమైన రోడ్లు ● ఏకధాటి వర్షాలతో ప్రజల ఇక్కట్లు

ఐదారు రోజులు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో పలు గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. పాత ఇళ్లు కూలాయి. రోడ్లు కొట్టుకుపోయి గుంతలేర్పడ్డాయి. వరుస వానలతో జనం ఇబ్బందులకు గురయ్యారు. రైతులు పంటల్లో కలుపు నివారణ చర్యలు చేపట్టలేకపోతున్నారు. రోడ్లపైనుంచి వరద ప్రవాహంతో రాకపోకలు స్తంభించాయి. కాగా బుధవారం వర్షం కాస్త విరామమిచ్చింది.


బషీరాబాద్: జీవన్గి పరిధి పత్తి చేనులో భారీగా చేరిన వాన నీరు


మూడు చింతలపల్లిలో నీట మునిగిన వరి పంట


పరిగి మండలం సయ్యద్ మల్కాపూర్‌లో కుళ్లిన పత్తి మొక్కలు


పరిగి: బురదమయంగా మారిన పరిగి-మిట్టకోడూరు రోడ్డు


ఘట్‌కేసర్ రూరల్: పోచారం పరిధి కొర్రెముల వద్ద మూసీ ప్రవాహం


యాలాల మండలం విశ్వనాథ్‌పూర్ గ్రామ సమీపంలో వర్షానికి పాడైన పెసర పంట


దోమ: కొత్తపల్లిలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి


శామీర్‌పేట్: అలుగు పారుతున్న అలియాబాద్ రామాలయం పెద్ద వాగు


మోమిన్‌పేట్: రామ్‌నాథ్‌గూడుపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి చేరిన వరద


కొడంగల్: వర్షాలకు కొట్టుకుపోయిన నందారం-కొడంగల్ రోడ్డు


ఘట్‌కేసర్‌లోని మాధవరెడ్డి వంతెన వద్ద గుంతలమయమైన బీటీ రోడ్డు


కొడంగల్ రూరల్: అలుగు పారుతున్న పెద్దనందిగామ చెరువు


ఘట్‌కేసర్ రూరల్: ఘట్‌కేసర్-ఎదులాబాద్ రోడ్డుపై చెట్ల తొలగింపు


శామీర్‌పేట: అలుగు పారుతున్న లాల్‌గడి మలక్‌పేటలోని మల్కచెరువు


కొడంగల్: కోతకు గురైన ఆశమ్మకుంట తండా రోడ్డు


కొడంగల్: వర్షాలకు కొట్టుకు పోయిన పెద్ద నందిగామ-నీటూర్ రోడ్డు

అనారోగ్యంతో బీఆర్ఎస్ నాయకుడి మృతి


యాదయ్యగౌడ్ మృతదేహం వద్ద సంతాపం తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కులకచర్ల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జంగం యాదయ్యగౌడ్ అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి బుధవారం గ్రామానికి చేరుకొని యాదయ్యగౌడ్ మృతికి సంతాపం తెలిపారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సిములు పాల్గొన్నారు.

అనంత చతుర్దశి నాడే వినాయక నిమజ్జనం


ఆలంపల్లి అశోక్ పంతులు

వికారాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అనంత చతుర్దశి రోజు నిర్వహించే వినాయక నిమజ్జనానికి, గ్రహణానికి ఎలాంటి సంబంధం లేదని దుర్గంచెరువు మఠాధిపతి ఆలంపల్లి అశోక్ పంతులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. వినాయక నిమజ్జనంపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం జరుగుతోందన్నారు. చవితిని పురస్కరించుకుని ఈ నెల 27న వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించుకుని పూజలు నిర్వహించుకోవాలన్నారు. తమకు అనుకూలంగా ఉండే వచ్చే నెల 3, 5, 6, 7, 9, 11 తేదీల్లో విగ్రహాలను నిమజ్జనం చేయొచ్చన్నారు. గ్రహణానికి ముందే విగ్రహాలను నిమజ్జనం చేయాలని కొందరు తప్పుడు ప్రచారంచేస్తున్నారని తెలిపారు. 6న అనంత చతుర్దశి నాడు నిమజ్జనోత్సవాన్ని జరపొచ్చన్నారు.

'హాస్టల్ స్థలం కబ్జా ఆరోపణలు నిజం కాదు'

దౌల్తాబాద్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):దౌల్తాబాద్‌లోని బీసీ హాస్టల్ ప్రహరీ స్థలాన్ని కబ్జా చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు నిజం కాదని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకట్రావ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి సీఎం కానప్పుడే సొంత డబ్బులతో భూమి కొని ప్రభుత్వానికి ఇచ్చారన్నారు.

కార్డుదారులకు పర్యావరణ హిత బ్యాగులు


(ఐదో పేజీ తరువాయి)

నెలవారీ కోటాను పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. సెప్టెంబర్ నుంచి లబ్ధిదారులు ఉచిత బియ్యం కోసం బ్యాగులు తీసుకెళ్లాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం అందజేసే పర్యావరణ హిత బ్యాగులను ఉచిత బియ్యం కోసం అలాగే నిత్యావసర సరుకుల కోసం వాడుకోవచ్చు.

ఆరు గ్యారెంటీల ప్రచారం

కాగా, ప్రభుత్వం అందజేసే పర్యావరణ హితమైన బ్యాగులపై ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు పథకాల గురించి ప్రచారం చేయనున్నారు. ఈ సంచులను వస్త్రంతో తయారు చేయించారు. దీనిపై ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీల పథకాలను ముద్రించి.. 'అందరికీ సన్న బియ్యం అందజేయడమే-ప్రభుత్వ లక్ష్యం' అనే నినాదాన్ని రాశారు. బ్యాగుపై సీఎం రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కల ఫొటోలున్నాయి. ఈ సంచులతో పర్యావరణానికి జరిగే మేలుతో పాటు ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో ప్రచారం జరగనుంది. ఇప్పటికే ఈ బ్యాగులు ఎంఎల్ఎస్ పాయింట్లకు చేరుకున్నాయి. సెప్టెంబరు నెల నుంచి ఉచిత బియ్యంతో పాటు బ్యాగులను పంపిణీ చేయనున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 15మండలాల్లో మొత్తం 618 రేషన్ దుకాణాలు, 5,37,805 రేషన్ కార్డులున్నాయి.

పంపిణీకి ఏర్పాట్లు పూర్తి



సెప్టెంబరు నెల కోటా సన్న బియ్యం పంపిణీతో పాటు లబ్ధిదారులకు పర్యావరణ హితమైన(వస్త్రంతో తయారు చేసిన) బ్యాగులను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అందుకనుగుణంగా జిల్లాలోని రేషన్ దుకాణాల్లో పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం. బ్యాగులను స్టాక్ పాయింట్లకు చేర్చాం.

- సుగుణాబాయి, జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి


ఘట్‌కేసర్ రూరల్: ఎదులాబాద్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


వికారాబాద్: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని కీసరగుట్ట ఆలయ కమిటీ డైరెక్టర్ సామల అమర్ తెలిపారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎదులాబాద్‌లలో ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అమర్ మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి రాజీవ్‌గాంధీ అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కుమార్, రమేష్, రాజేందర్‌గౌడ్, కృష్ణ, ఓం ప్రకాశ్, ఇక్బాల్, రాజిరెడ్డి, జంగయ్య, బస్వయ్య, సుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్:వికారాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ, కిషన్‌నాయక్, రమేష్, రెడ్యానాయక్, మురళి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లి: రాజీవ్‌గాంధీ జయంతిని మర్పల్లిలో కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు తుమ్మల సురేశ్‌యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు యు.రవీందర్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నవ భారత నిర్మాత, యువతకు స్ఫూర్తిప్రదాత రాజీవ్‌గాంధీ అన్నారు. కార్యక్రమంలో నాయకులు కలీం, రఫీ, ఫసియొద్దీన్, మల్లేశ్, రాచన్న, సురేశ్, సలీం, అశోక్‌రెడ్డి, నర్సిములుయాదవ్, మన్మోహన్, రవీందర్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, గణేశ్, నాగేశ్, వెంకట్రామ్‌రెడ్డి, ఈశ్వర్, శోభన్, పంతులు బాయి, శ్రీను, అంజన్న, రవి, పాండు, శ్రీను, రాములు పాల్గొన్నారు.

పరిగి: రాజీవ్ గాంధీతోనే దేశం సాంకేతిక విప్లవానికి నాందిపలికిందని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ ప్రజల గుండెల్లో రాజీవ్ చిరస్థాయిగా నిలిచిపోయారని చెప్పారు. దేశం కోసం ఇందిరాగాంధీ కుటుంబం ప్రాణాలు త్యాగం చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, కార్యదర్శి కె.హన్మంతు, ఇ.కృష్ణ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు మారువలేనివని కాంగ్రెస్ నాయకులన్నారు. ఘట్‌కేసర్ , పోచారం మున్సిపాలిటీల్లో రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. నవ భారత నిర్మాత రాజీవ్‌గాంధీ అని, దేశంలో సాంకేతిక విప్లవాన్ని తెచ్చారన్నారు.


మర్పల్లి: రాజీవ్‌గాంధీ జయంతిలో కాంగ్రెస్ నాయకులు


పరిగిలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ ఆర్జీకే కాలనీలో రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నాయకుల నివాళులు

వినాయక మండపాలకు అనుమతి తీసుకోవాలి


చవితి ఉత్సవాలపై మాట్లాడుతున్న దుద్యాల, కులకచర్ల, బషీరాబాద్ ఎస్సైలు యాదగిరి, రమేశ్‌కుమార్, నమాన్ అలీ

దుద్యాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితికి మండపాల ఏర్పాటుకు ఉత్సవ కమిటీలు అనుమతి తప్పక తీసుకోవాలని దుద్యాల ఎస్సై యాదగిరి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండపాల్లో నాణ్యమైన విద్యుత్ వైర్లు, పరికరాలను ఉపయోగించాలన్నారు. డీజేలకు అనుమతి లేదన్నారు.

కులకచర్ల/చౌడాపూర్: ఈ నెల 27న వినాయక చవితి సందర్భంగా కులకచర్ల ఎస్సై రమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. వినాయక ఉత్సవ కమిటీలు, అధికారుల సూచనలు పాటిస్తూ శాంతియుతంగా ఉత్సవాలను నిర్వహించాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

బషీరాబాద్: బషీరాబాద్ ఎస్ఐ నమాన్ అలీ మట్లాడుతూ.. గణపతి మండపాల నిర్వాహకులు విగ్రహం ఎత్తు, ఏర్పాటు చేస్తున్న ప్రదేశం, తేదీ తదితర సమాచారాన్ని పోలీసు శాఖ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందుల్లేని ప్రదేశాల్లోనే మండపాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండప కమిటీ, నిర్వాహకుల పేర్లతో ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలన్నారు. షెడ్డును నాణ్యంగా వేసుకోవాలన్నారు. మండపాల వద్ద మద్యం తాగడం, పేకాట ఆడటం, అసభ్యకర నృత్యాలు వంటివి చేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. సూచించిన చెరువుల్లోనే నిమజ్జనాలు చేయాలన్నారు.

పేదల ఆరోగ్యానికి అండగా సీఎం రిలీఫ్ ఫండ్

బొంరాస్‌పేట్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి ప్రభుత్వం అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం మండలంలోని సీత్యానాయక్ తండాకు చెందిన కాట్రావత్ నందినికి రూ.50వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మాజీ సర్పంచ్ మోత్యానాయక్ అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాపల్లి సంతోష్‌నాయక్, మహేందర్‌సింగ్, గోపాల్‌నాయక్, భీమ్లానాయక్, దాస్యనాయక్, రూప్‌సింగ్ నాయక్, తార్యానాయక్, హూనా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రేపు ఎమ్మెల్యే శంకుస్థాపన

తాండూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం చేపట్టిన పనుల జాతర 2025లో భాగంగా తాండూరు నియోజకవర్గంలో ఈ నెల 22న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. రూ.3కోట్లతో 9 పంచాయతీ భవనాలు, 11 అంగన్‌వాడీ భవనాలను శంకుస్థాపన చేస్తారని క్యాంప్ కార్యాలయం బుధవారం పేర్కొంది. పెద్దేముల్ మండలం సిద్ధన్నమడుగు తండా, యాలాల మండలం జుంటుపల్లి, పగిడిపల్లి పంచాయతీ భవనాలు, పెద్దేముల్ మండలం ఇందూర్, బండపల్లి, యాలాల మండలం ముకుందాపూర్‌లో అంగన్‌వాడీలకు శంకుస్థాపనలు చేస్తారు.

సీపీఐ రాష్ట్ర మహాసభల ప్రతినిధిగా సురేశ్‌కుమార్

కొడంగల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర మహాసభలకు సీపీఐ కొడంగల్ నియోజకవర్గ నాయకుడు జీ.సురేశ్‌కుమార్‌కు అవకాశం లభించింది. బుధవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర మహాసభలకు ప్రతినిధిగా అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా, రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలిపారు.

విరాసత్ చేయిస్తానని రూ.50వేల వసూలు


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతు బిచ్చన్న

పూడూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):భూమి విరాసత్ చేయిస్తానని చెప్పి మీ-సేవ నిర్వాహకుడు తన వద్ద రూ.50వేలు తీసుకున్నాడని బుధవారం ఓ రైతు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. పూడూరుకు చెందిన చాకలి బిచ్చన్న భూమి విరాసత్ కోసం షాబాద్ సురేష్ మీ-సేవ కేంద్రానికి వెళ్లాడు. విరాసత్‌కు రూ.1లక్ష ఇవ్వాలని కోరగా, తాను రూ.50వేలు ఫోన్‌పే చేశానని రైతు తెలిపాడు. డబ్బులు తీసుకుని తనకు విరాసత్ ఇవ్వలేదని, తనను మోసగించిన సురేష్‌పై చర్యలు తీసుకొని తన డబ్బులు ఇప్పించాలని రైతు బిచ్చన్న తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాడు.

ఏబీవీపీ పరిగి పట్టణాధ్యక్షుడిగా శ్రీనివాస్



పరిగి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ పరిగి పట్టణ అధ్యక్షుడిగా శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని జిల్లా కన్వీనర్ హరీష్‌రావు ప్రకటించారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తానని ఆయన తెలిపారు.

తాండూరు అధికారుల్లో పెచ్చుమీరిన అవినీతి


మాట్లాడుతున్న మాజీ కౌన్సిలర్ సంగీత

తాండూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): తాండూరులోని అన్ని ప్రభుత్వ శాఖల్లో అవినీతి పెచ్చుమీరిందని, మున్సిపల్ కార్యాలయంలోనైతే పైసలివ్వ నిదే అధికారులు పనిచేయడం లేదని మున్సిపల్ మాజీ కౌన్సిలర్ సంగీతఠాకూర్ అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. అధికారులు మామూళ్ల కోసం సహాయకులను నియమించుకుంటున్నారన్నారు. శానిటేషన్ మెటీరియల్ కాంట్రాక్ట్ రూ.50లక్షల కొనుగోళ్లలో అవకతవకలపై పత్రికల్లో వచ్చిన కథనాలతో అదే కాంట్రాక్ట్ రూ.18లక్షలకు తగ్గించారని అన్నారు. ఇలా ఒక్క దానిలో కాదు అన్ని విభాగాలు, అన్ని శాఖల్లో అధికారులు లంచాలకు మరిగారని సంగీత మండిపడ్డారు.

ఆలయ భూమిలో నిర్మాణాలు చేపడితే చర్యలు

ఘట్‌కేసర్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):ఘట్‌కేసర్‌లోని ఎండోమెంట్ భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా చట్టపరమైన చర్యలు తప్పవని ఘట్‌కేసర్ గట్టుమైసమ్మ ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి బుధవారం హెచ్చరించారు. నిర్మాణాలను కొనేందుకు డబ్బులిస్తే తమకు సంబంధం లేదని తెలిపారు. కాగా అక్రమ నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

క్రైం కార్నర్

సంగమేశ్వరాలయంలో చోరీ


దుండగులు పగులగొట్టిన ఆలయంలోని హుండీ

యాలాల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధి సంగెంఖుర్దు సంగమేశ్వర ఆలయంలో దొంగతనం జరిగింది. ఈ సంఘటన మంగళవారం రాత్రి జరుగగా.. బుధవారం వెలుగులోకి వచ్చింది. ఆలయ పూజారి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సంగెంఖుర్దు సమీపంలో గల సంగమేశ్వర దేవాలయంలో దుండగులు మంగళవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. దేవాలయంలోని సీసీ కెమెరాలను పగలగొట్టి ఆలయ గర్భగుడిలో గల హుండీని పగలగొట్ట దోచుకెళ్లారని పేర్కొన్నారు. భారీ మొత్తం నగదు ఎత్తుకెళ్లారని తెలిపారు. ఇప్పటి వరకు ఈ ఆలయంలో ఐదారుసార్లు దొంగతనాలు జరిగినా దొంగలను పోలీసులు పట్టుకోలేదని పేర్కొన్నారు. పోలీసు ఉన్నతాధికారులు ఆలయాల్లో చోరీలు జరుగకుండా రాత్రిపూట గస్తీ ఏర్పాటు చేయాలని కోరారు.